ప్రచురణార్థమైన

భారతదేశ సర్వోన్నత న్యాయస్థానము

క్రిమినల్ అప్పీల్లేట్ జూరిస్డిక్షన్

క్రిమినల్ అప్పీల్ నెం. 1480/2011

(ఎస్ఎల్పీ (సిఆర్ఎల్.) నెం.10543/2010 నుండి ఉత్పన్నమైనది)

హర్భజన్ సింగ్ ---అప్పీలుదారు

వర్సెస్

హర్యానా రాష్ట్రం ---ప్రతివాది

# తీర్పు

**గౌరవ న్యాయమూర్తి రాజేష్ బిందాల్.**

1. అప్పీలుదారు అయిన హర్భజన్ సింగ్ విచారణ కోర్టు తేదీ 18.05.2005న ఇచ్చిన తీర్పు ద్వారా నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ చట్టము, 1985 (ఇకపై ఇది "ఎన్డిపిఎస్ యాక్ట్" అని పిలవబడుతుంది) లోని సెక్షన్ 25 కింద దోషిగా నిర్ధారింపబడినాడు మరియు అతనికి 10 సంవత్సరాల కారాగార శిక్ష విధించబడింది. తేదీ 14.05.2010 న అప్పీల్ లో ఇచ్చిన ఉత్తర్వు ద్వారా హైకోర్ట్ అప్పీలుదారుడి పైన జరిగిన నేర నిర్ధారణ మరియు అతనికి విధించిన శిక్షలను ఆమోదించినది. ఈ ఉత్తర్వును ఈ కోర్టు ముందు ప్రస్తుతం సవాలు చేయడమైనది.

2. కేసు వాస్తవాలు క్లుప్తంగా ఈ విధంగా ఉన్నాయి. అప్పీలుదారుడు రిజిస్ట్రేషన్ నెం.PAT/2029 గల ట్రక్కుకు యజమాని. తేదీ 15.05.2000 న రాత్రి 9 గంటల సమయంలో అగ్రోహా గ్రామంలోని హిసార్ రోడ్ లో ఉన్న హనుమాన్ మందిర్ వద్ద ఈ ట్రక్కు బోల్తా పడినది. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న పోలీసు బృందం ఇచ్చిన సమాచారం మేరకు తేదీ 16.05.2000 న సాయంత్రం 4.25 గంటల సమయంలో మొదటి సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నెం. 68 నమోదు చేయబడినది. రామ్ సరూప్

(పిడబ్ల్యు-6) మరియు నరేష్ కుమార్ (పిడబ్ల్యు-10) అనే ఇద్దరు సాక్షులు పోలీసు బృందానికి అందించిన సమాచారం మేరకు, తేదీ 15.05.2000 న సుమారుగా రాత్రి 9 గంటల సమయంలో ట్రక్కు డివైడర్ ను ఢీకొనడంతో ప్రమాదము జరిగినది. ట్రక్కు డ్రైవర్ మరియు క్లీనర్, ట్రక్కు నుండి బయటకు వచ్చినారు. ఈ సాక్షులు వారిని అడిగినప్పుడు వారు తమ పేర్లను జాంగ్ సింగ్ కుమారుడు జోగిందర్ సింగ్ మరియు నచ్చత్తర్ సింగ్ కుమారుడైన గుర్మైల్ సింగ్ అని తెలిపారు . వారు ఇంకా ట్రక్కు యజమాని పేరు హర్భజన్ సింగ్ అని కూడా తెలిపినారు . తరువాత ట్రక్కు యజమానిని పిలవాలి అనే నెపంతో ఆ డ్రైవర్, క్లీనర్ అక్కడి ఉంది వెళ్ళిపోయి మళ్ళీ తిరిగి రాలేదు. పోలీసులు అనుమానంతో ఆ ట్రక్కులో లోడ్ చేసి ఉన్న సంచులను చూసి వానిలో నిషిద్ధ పదార్థములు ఉన్నవని కనుగొని ఆ సంచులను ట్రక్కు నుండి దింపి స్వాధీనం చేసుకున్నారు. వాని నుండి నమూనాలను సేకరించి పరీక్షించడానికి పంపినారు. దర్యాప్తు పూర్తి చేసిన తరువాత, జోగిందర్ సింగ్, గుర్మైల్ సింగ్ మరియు అప్పీలుదారులపై చార్జి షీటు దాఖలు చేసినారు. విచారణ సమయంలో పోలీసులకు డ్రైవర్, క్లీనర్ యొక్క పేరులను తెలిపినారని చెప్పబడిన ఇద్దరు సాక్షులను ప్రాసిక్యూషన్ కు వ్యతిరేక సాక్షులుగా ప్రకటింపబడినందున విచారణ కోర్టు జోగిందర్ సింగ్ మరియు గుర్మైల్ సింగ్ లను నిర్దోషులుగా నిర్ధారించడమైనది. కానీ ట్రక్కునకు రెజిస్టర్డ్ యజమాని అయిన అప్పీలుదారుడిని ఎన్డిపిఎస్ సెక్షన్ 25 కింద దోషిగా నిర్ధారించడం మరియు దానిని హైకోర్టు సమర్థించడం జరిగినది.

3. అప్పీలుదారిని తరపున అతని న్యాయవాది లేవనెత్తిన వాదము సంక్షిప్తముగా ఈ క్రింది విధంగా ఉన్నది: వాహనం యొక్క యజమాని అతనికి తెలిసి తన వాహనాన్ని నేరం చేయడం కోసం ఉపయోగించడానికి అంగీకరించినట్లైతేనే అతడు ఎన్డిపిఎస్ చట్టము యొక్క సెక్షన్ 25 క్రింద దోషి అవుతాడు. కానీ అలాంటి కేసు ఏదీ ప్రాసిక్యూషన్ వారు కోర్టు ముందు ఉంచలేకపోయినారు. ప్రాథమిక వాస్తవాలను రుజువు చేయడంలో ప్రాసిక్యూషన్ కు ఉన్న ప్రథమ బాధ్యతను నెరవేర్చడంలో అది విఫలమైనందున ఎన్డిపిఎస్ చట్టము సెక్షన్ 35లో పేర్కొన్న పురోభావనను కూడా ఇక్కడ భావించలేము. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 లోని సెక్షన్ 313 కింద నమోదు చేసిన అప్పీలుదారుడి యొక్క వివరణలో, అతను దలేల్ సింగ్వాలాకు చెందిన కాశ్మీర్ సింగ్ కుమారుడు హోషియార్ సింగ్ అనే వ్యక్తికి ఇసుక తీసుకెళ్లడానికి ట్రక్కును అద్దెకు ఇచ్చినట్లుగా చెప్పబడినది. అప్పీలుదారుడిని ఘటనా స్థలం నుండి అరెస్టు చేయలేదు. ట్రక్కు డ్రైవర్ మరియు క్లీనర్ ఇప్పటికే నిర్దోషులుగా విడుదలయ్యారు మరియు వారి నిర్దోషిత్వాన్ని సవాలు చేస్తూ ప్రభుత్వం ఎటువంటి అప్పీల్ ను దాఖలు చేయలేదు.

తన వాదనకు మద్దతుగా అప్పీలుదారు తరపున వాదించిన గౌరవ న్యాయవాది ఈ క్రింద చెప్పిన కేసులలో ఈ కోర్టు ఇచ్చిన తీర్పులపై ఆధారం ఉంచినారు.

**బల్వీందర్ సింగ్ వర్సెస్ అసిస్టెంట్ కమిషనర్, కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ ((2005) 4 SCC 146); ప్రభుత్వం తరపున ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, నార్కోటిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో, మదురై, తమిళనాడు వర్సెస్ రాజంగం ((2010) 15 SCC 369); భోలా సింగ్ వర్సెస్ పంజాబ్ రాష్ట్రం ((2011) 11 SCC 653 ) మరియు గంగాధర్ అలియాస్ గంగారాం వర్సెస్ మధ్యప్రదేశ్ రాష్ట్రం ((2020) 9 SCC 202).**

4. మరోవైపు, గౌరవ ప్రభుత్వ న్యాయవాది ఈ క్రింది విధంగా తమ వాదనను వినిపించినారు: తన ట్రక్కును ఎటువంటి చట్టవిరుద్ధ కార్య కలాపములకు వినియోగించలేదన్న తన కేసును నిరూపించడంలో అప్పేలుదారుడు విఫలమయ్యారు. ట్రక్కు యజమాని పరోక్ష బాధ్యత వహించవలసి ఉంటుంది. ఇసుకను మోసుకెళ్లడానికి తన ట్రక్కును ఇచ్చినానన్న వైఖరిని ఆయన తీసుకున్నప్పటికీ, తన ఈ వాదనను నిరూపించడానికి ఆయన ఎటువంటి సాక్ష్యమును చూపించలేదు. కనుక పురోభావన అతనికి వ్యతిరేకంగా ఉంటుంది.

5. ఈ కేసులోని కక్షిదారుల తరపున వారి వారి గౌరవ న్యాయవాదులను వినడం మరియు సంగత రికార్డులను పరిశీలించడం జరిగినది.

6. ఈ కేసులోని ప్రాథమిక వాస్తవాలను గూర్చి వివాదం లేదని గమనించడమైనది. ట్రక్కునకు యజమానిగా నమోదు చేయబడిన అప్పీలుదారుడు ఘటనా స్థలం నుండి అరెస్టు చేయబడలేదు. జోగిందర్ సింగ్, గుర్మైల్ సింగ్ అనే వారు ట్రక్కు డ్రైవర్ మరియు క్లీనర్ అని ప్రాసిక్యూషన్ కేసులో చెప్పియున్నారు. వారిని కూడా ఘటనా స్థలం నుండి అరెస్టు చేయలేదు. రామ్ సరూప్ (పిడబ్ల్యు-6), నరేష్ కుమార్ (పిడబ్ల్యు-10) పోలీసు బృందానికి అందించిన సమాచారం ఆధారంగా వారి గుర్తింపును నిర్ధారించారు. అయితే, కోర్టులో హాజరైనప్పుడు, వారు ఇరువురూ ప్రతికూల సాక్షులుగా ప్రకటించబడ్డారు. కోర్టు జోగిందర్ సింగ్ మరియు గుర్మైల్ సింగ్ లను నిర్దోషులుగా ప్రకటించింది. అప్పీలుదారు ట్రక్కు యజమాని. అతన్ని ఘటనా స్థలం నుండి అరెస్టు చేయలేదు. ఎన్డిపిఎస్ చట్టము సెక్షన్ 25 ప్రకారం, వాహనం యజమాని తెలిసే దానిని ఎన్డిపిఎస్ చట్టం కింద శిక్షార్హమైన ఏదైనా నేరానికి ఉపయోగించడానికి అనుమతిస్తేనే, అతను తదనుగుణంగా శిక్షించబడతాడు.

7. ప్రస్తుత కేసులో అప్పీలుదారునికి తెలిసి మరియు సమ్మతితో వాహనం చట్టవిరుద్ధ కార్య కలాపములకు వినియోగించబడిందని చూపించడానికి అవసరమైన ఆధారాలను సమర్పించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైంది. ప్రాథమిక వాస్తవాలను నిరూపించడానికి తనపై ఉన్న ప్రధాన బాధ్యతను నెరవేర్చడంలో ప్రాసిక్యూషన్ విఫలమైనందున ఎన్డిపిఎస్ చట్టము సెక్షన్ 35 కింద పురోభావన కూడా అందుబాటులో ఉండదు. అందువలన రుజువు బాధ్యత నిందితుడిపైకి మారదు.

8. పైన పేర్కొన్న **భోలా సింగ్** కేసులో ఈ కోర్టు ఈ సమస్యను పరిశీలించింది. ఎన్డిపిఎస్ చట్టము యొక్క సెక్షన్ 25ను వర్తింపజేయడానికి అవసరమైన విధంగా యజమాని యొక్క ఎరుక మరియు సమ్మతితో వాహనాన్ని ఉపయోగించకపోతే, దాని (ఈ సెక్షన్) క్రింద శిక్షను చట్టబద్ధంగా కొనసాగించలేమని ఈ కేసులో ఈ కోర్టు అభిప్రాయపడింది. సంబంధిత పేరాలు ఈ క్రింద ఇవ్వబడ్డాయిః

> "8. మేము న్యాయవాది చెప్పిన వాదనలను పరిశీలించాము. అప్పీలుదారు అయిన భోలా సింగ్ తనకు తెలిసి ఏదైనా అనుచితమైన కార్యం కోసం వాహనాన్ని ఉపయోగించడానికి అనుమతించారని సూచించడానికి ఎటువంటి సాక్ష్యము లేనందున ప్రస్తుత కేసులో చట్టము యొక్క సెక్షన్ 25 వర్తించదని మేము గమనించినాము. అందువలన ఈ చట్టము యొక్క సెక్షన్ 25 ను ఈ కేసుకు తప్పకుండా వర్తింపజేయడానికి ఆవశ్యకత ఇక్కడ ఏర్పడలేదు.
>
> 9. కానీ హైకోర్టు అప్పీలుదారునికి వ్యతిరేకంగా ఈ చట్టము యొక్క సెక్షన్ 35 కింద ఒక పురోభావనను భావించినది. ఈ సెక్షన్ క్రింద చెప్పబడింది.
>
> **"35. దోషపూరితమైన మానసిక స్థితి గురించిన పురోభావన —**
>
> (1) ఈ చట్టములోని నేరానికి సంబంధించిన ఏదైనా ప్రాసిక్యూషన్ లో , నిందితుడి దోషపూరితమైన మానసిక స్థితిని గురించి వచ్చినప్పుడు , కోర్టు అలాంటి మానసిక స్థితి ఉందని పురోభావనను భావించవలసి ఉంటుంది మరియు నిందితుడు, తన ప్రతివాదనలో, తనపై ఆరోపింపబడిన నేరమునకు సంబంధించి తనకు దోషపూరితమైన మానసిక స్థితి లేదని నిరూపించుకొనవలసి ఉంటుంది.

**వివరణ.**——ఈ సెక్షన్ కు సంబంధించి , ఏదైనా ఒక వాస్తవాన్ని గురించిన ఉద్దేశ్యం, ప్రేరక హేతువు, దానిని గురించిన ఎరుక మరియు నమ్మకం లేదా నమ్మకానికి హేతువు, ఇవన్నీ "దోషపూరితమైన మానసిక స్థితి" లో భాగాలు అవుతాయి.

(2) ఈ సెక్షన్ కోసం , ఒక వాస్తవం రుజువు అవ్వాలంటే కేవలం అది జరగడానికి ఎక్కువ ఆస్కారం ఉన్నదిగా నిర్ధారితం అయితే చాలదు , దానిని గురించి సందేహానికి అతీతంగా కోర్టు నమ్మవలసి ఉంటుంది.

10. ఈ చట్టము యొక్క సెక్షన్ 54 క్రింద స్వాధీనం అనే ప్రశ్న గురించి మరియు సెక్షన్ 35 కింద లేవనెత్తిన పురోభావన గురించిన అంశం గురించి పరిశీలిస్తూ, **నూర్ ఆగా వర్సెస్ పంజాబ్ రాష్ట్రం ((2008) 16 SCC 417)** కేసులో, ఈ కోర్టు సెక్షన్ 35 యొక్క రాజ్యాంగ బద్దతను సమర్థిస్తూ, ఈ క్రింది విధంగా అభిప్రాయపడినది: ఈ సెక్షన్ నిందితుడిపైన బరువైన వ్యతిరేక భారాన్ని మోపుతున్నందున దీనిని మరియు దీనికి సంబంధించిన ఇతర సెక్షన్ లను వర్తింపజేయాలంటే ముందుగా ప్రాథమిక వాస్తవాలను నిరూపించవలసిన ప్రాసిక్యూషన్ యొక్క బాధ్యతను నిర్వహించవలసి ఉంటుంది. తరువాతే సెక్షన్ 35 అమలులోకి వస్తుంది.

11. ప్రస్తుత కేసులోని వాస్తవాలను పైన ఉదహరించిన కేసునకు ఆపాదించి చూస్తే, అప్పీలుదారునకు, తన యొక్క వాహనం మాదకద్రవ్యాల రవాణాకు ఉపయోగించబడుతుందనే విషయాన్ని గురించిన పరి జ్ఞానం ఉన్నదని రుజువు చేయాల్సిన ప్రాథమిక బాధ్యత ప్రాసిక్యూషన్ పై ఉన్నదని మరియు కేసులోని సాక్ష్యాల ద్వారా ఈ పరిజ్ఞానాన్ని గురించి సందేహాలకు అతీతంగా రుజువు చేసినప్పుడే , సెక్షన్ 35 కింద పురోభావనను భావించడానికి అవకాశం ఉంటుందని తెలుస్తుంది. సెక్షన్ 35 ప్రకారం నిందితుడి యొక్క 'కలంకిత మానసిక స్థితి' అనే దానిని సహేతుకమైన సందేహాలకు అతీతంగా రుజువు చేయబడాల్సిన ఒక వాస్తవంగా పరిగణించాల్సి ఉంటుంది , అంతే కానీ జరగడానికి ఎక్కువ ఆస్కారం ఉండే విషయంగా మాత్రమే చూపితే సరిపోదు. అప్పీలుదారుడి యొక్క మానసిక స్థితిని తెలిపే సాక్ష్యాధారాలు

> లేనందున సెక్షన్ 35 కింద పురోభావనను భావించలేమని మేము అభిప్రాయపడుతున్నాము. అప్పీలుదారుడు , వాస్తవానికి హర్యానాలోని ఫతేహాబాద్ వాస్తవ్యుడు అయి ఉండి తన నివాసం యొక్క చిరునామాను రాజస్థాన్ గా ఇవ్వడం మరియు అతడు ఈ ట్రక్కును సూపర్దారి క్రింద తీసుకున్నాడన్న విషయాల మీద, అప్పీలుదారుని యొక్క ప్రవర్తనను గురించి చూపడానికి ప్రాసిక్యూషన్ ఆధారపడుతున్నది. కానీ ఏ విధంగా ఆలోచించినా నేరానికి ఉపయోగించిన ట్రక్కు యొక్క రిజిస్ట్రేషన్ చేయించిన విధానం, దాని డ్రైవర్ మరియు ఇతరులు ఈ వాహనాన్ని దుర్వినియోగపరుస్తున్నారు అన్న పరిజ్ఞానాన్ని అప్పీలుదారునికి ఆపాదించగలదని అనుకోలేము."

**(ప్రాధాన్యత ఇవ్వబడింది)**

9. పెట్రోల్ డ్యూటీ మీద ఉన్న సబ్ ఇన్స్పెక్టర్ రామ్ మెహర్ (పిడబ్ల్యు-8) PAT/2029 నెంబర్ కలిగిన ట్రక్కు తలక్రిందులై ఉండడం , ఏదో పొడితో కూడిన సంచులు చెల్లాచెదురుగా పడి ఉండడం గమనించి ఫిర్యాదు ఇవ్వడం వలన తేదీ 16.05.2000 న ఎఫ్ఐఆర్ No.68 నమోదు చేయబడిందని ఈ కేసు యొక్క వాస్తవాలు తెలుపుతున్నవి. ఆ సమీపంలో ఉన్న అంగడి దారులైన రామ్ సరూప్ (పిడబ్ల్యు-6) మరియు నరేష్ కుమార్ (పిడబ్ల్యు-10) ఆ ప్రమాదము తేదీ 15.05.2000 న రాత్రి 9 గంటలకు జరిగినట్లుగా అతనికి తెలిపినారు. ప్రమాదము జరిగిన తరువాత, డ్రైవర్ మరియు క్లీనర్ ట్రక్కు క్యాబిన్ నుండి బయటకు వచ్చారు. ఈ సాక్షులు వారిని అడిగినప్పుడు వారు వాళ్ళ పేర్లను జాంగ్ సింగ్ కుమారుడు జోగిందర్ సింగ్ మరియు నచ్చత్తర్ సింగ్ కుమారుడు గుర్మైల్ సింగ్ అనియు మరియు వారు ఆ ట్రక్కుకు డ్రైవర్, క్లీనర్ అనియు చెప్పియున్నారు. వారు ఈ ప్రమాదం గురించి ట్రక్కు యజమానికి తెలియజేయడానికి వెళ్లి మళ్ళీ తిరిగి రాలేదు. ఈ ట్రక్కులో నిషేధిత పదార్థాలు రవాణా చేయబడుతున్నాయన్న అనుమానంతో, ఆ ట్రక్కును మరియు దానిలోని పదార్థాలను స్వాధీనం చేసుకోవడం జరిగినది.

10. ప్రాసిక్యూషన్ తరపున 11 మంది సాక్షులను విచారించినారు. రామ్ సరూప్ (పిడబ్ల్యు-6) మరియు నరేష్ కుమార్ (పిడబ్ల్యు-10) అనే ఇద్దరు ప్రాసిక్యూషన్ సాక్షులు ఈ కేసులో ముఖ్యమైన సాక్షులు అని చెప్పవచ్చు . ఎందుకంటే ఎఫ్ఐఆర్ ప్రకారం వీరిద్దరూ ట్రక్కు డ్రైవర్ మరియు క్లీనర్ ల యొక్క పేర్లను తెలిపినారు. కానీ, వారు తాము పోలీసులకు తమ సమక్షంలో జరిగిన ఏదైనా

సంఘటన గురించి తెలిపినాము అనడాన్ని త్రోసిపుచ్చినారు. వారిద్ద రినీ వ్యతిరేక సాక్షులుగా ప్రకటించడం జరిగింది. వారు ట్రక్కు డ్రైవర్ ను మరియు క్లీనర్ ను కూడా గుర్తించడం జరగలేదు. ఎఎస్ఐ రామ్ సరూప్ (పిడబ్ల్యు-7), సబ్ ఇన్స్పెక్టర్ రామ్ మెహర్ (పిడబ్ల్యు-8) తో పాటు అగ్రోహా పోలీస్ స్టేషన్లోని ఉద్యోగి. ఇతడు ఎఫ్ఐఆర్ నకు లేఖరి. ఎఫ్ఐఆర్ లో చెప్పబడిన విషయాలను తన సాక్ష్యములో తిరిగి చెప్పడం కాక ఇతడు ఈ క్రింది విధంగా కూడా సాక్ష్యం ఇచ్చినాడు.

తేదీ 19.05.2000 న బర్వాలా లోని న్యూ గ్రెయిన్ మండి వాస్తవ్యుడు అయిన చటర్ సింగ్ కుమారుడు అయిన బల్వాన్ సింగ్ తనతో , ట్రక్కు డ్రైవర్ మరియు క్లీనర్ అయిన జాంగ్ సింగ్ కుమారుడు అయిన జోగిందర్ సింగ్ మరియు నచ్చత్తర్ సింగ్ కుమారుడు అయిన గుర్మైల్ సింగ్ లు అతనితో తాము హర్భజన్ సింగ్ యొక్క నిర్దేశాల మేరకు రాజస్థాన్ నుండి 21 సంచుల చురాపోస్ట్ ను, పౌడర్ తో సహా తీసుకోస్తూ ఉండగా అగ్రోహా వద్ద ట్రక్కు తిరగబడిందని తెలిపినట్లుగా , చెప్పినాడు. పోలీసు బృందం వారు వారి కోసం వెతుకుతున్నందు వలన, వారిని పోలీసుల ముందు హాజరుపరచాలని కూడా కోరినారు . కానీ , చతర్ సింగ్ కుమారుడు అయిన బల్వాన్ సింగ్ ను సాక్షిగా హాజరుపరచలేదు. ట్రక్కు డ్రైవర్ మరియు క్లీనర్ చటర్ సింగ్ కుమారుడు అయిన బల్వాన్ సింగ్ అతని ముందు న్యాయ స్థానేతర ఒప్పుకోలు చేసినట్లుగా ప్రాసిక్యూషన్ తమ కేసును చెప్పడానికి ప్రయత్నం చేసినది. ఎఫ్ఐఆర్ యొక్క లేఖరి అయిన రామ్ మెహర్ పిడబ్ల్యు-8 గా హాజరయ్యారు. అతని సాక్షములో కూడా, అప్పీలుదారునకు వ్యతిరేకంగా ఏమీ లేదు. అతను చటర్ సింగ్ కుమారుడు అయిన బల్వాన్ సింగ్ యొక్క వాంగ్మూలాన్ని దర్యాప్తు సమయంలో నమోదు చేసినట్లుగా మాత్రమే చెప్పినాడు. కానీ , అతడు (చటర్ సింగ్ కుమారుడు అయిన బల్వాన్ సింగ్) సాక్ష్యము కొరకు హాజరు పరచబడలేదు.

11. తన వాంగ్మూలాన్ని సిఆర్పిసి యొక్క సెక్షన్ 313 క్రింద నమోదు చేసే సమయంలో తనకు ఇచ్చిన సూచనలను అన్నింటినీ అప్పీలుదారుడు త్రోసిపుచ్చినారు. అప్పీలుదారుడికి తెలిసి నేరం జరిగిందన్న ప్రాథమికమైన వాస్తవాన్ని నిరూపించగలిగిన సాక్ష్యాలను కోర్టు ముందు ఉంచవలసిన ప్రాథమిక బాధ్యతను నిర్వర్తించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైనది. ఇది ఇతడు వాహనంలో ఉండడం కానీ , ఇతడు ప్రమాదం జరిగిన స్థలం నుండి కానీ లేక వాహనం మరియు నిర్దిష్ట పదార్థములు స్వాధీనం చేసుకుంటున్నప్పుడు కానీ , అరెస్టు చేయబడిన కేసు కాదు. కేవలం అతను ట్రక్కునకు రిజిస్టర్డ్ యజమాని అన్న విషయం మీద దోషిగా నిర్ధారించబడినారు. అప్పీలుదారుడు వాహనమునకు రిజిస్టర్డ్ యజమాని అయినందున మొత్తముగా తనను రక్షించుకొనే బాధ్యతను విచారణ కోర్టు అతని మీదే ఉంచినది . వాహనం యొక్క డ్రైవర్ మరియు క్లీనర్ పేదవారు

అయినందున, యజమాని యొక్క అనుమతి లేకుండా అంత పెద్ద మొత్తములో నిషిద్ధ పదార్థాన్ని స్మగుల్ చేసే రిస్కును తెసుకోవడానికి సాహసించరని , అప్పీలుదారుడే తన వైఖరిని స్పష్టం చేయాలని కోర్టు అభిప్రాయపడింది. హైకోర్టు విచారణ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది.

12. ప్రస్తుత కేసులో అప్పీలుదారునికి వ్యతిరేకంగా నేర నిర్ధారణ చేసే సమయంలో క్రింది న్యాయస్థానాలు చేసిన ప్రాథమిక తప్పిదం ఏమిటంటే ప్రాసిక్యూషన్ ప్రాథమిక వాస్తవాలను నిరూపించకపోయినా, అప్పీలుదారునికే తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యతను బదిలీ చేయడం. కాబట్టి , అప్పీలుదారునికి వ్యతిరేకంగా జరిగిన నేర నిర్ధారణ చట్టబద్ధంగా సమర్ధనీయం కాదు.

13. పైన పేర్కొన్న కారణాల వలన, ఈ అప్పీల్ ను ఆమోదించడమైనది. క్రింది కోర్టులు ఇచ్చిన తీర్పులను త్రోసిపుచ్చడమైనది. అప్పీలుదారుడి యొక్క జామీను బాండ్లు రద్దు చేయబడినాయి.

, న్యాయమూర్తి.

(అభయ్ ఎస్. ఓకా)

, న్యాయమూర్తి.

(రాజేష్ బిందాల్)

న్యూ ఢిల్లీ

ఏప్రిల్ 25, 2023